క్లుప్తంగా

మూలకు చేరిన సోలార్ ట్రీ



పాడైపోయిన సోలార్ ట్రీ

ఏయూక్యాంపస్ : సాగర తీరంలో సబ్‌మెరైన్ మ్యూజియం చేరువలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రీ మూలకు చేరింది. ప్రస్తుతం సౌర ఫలకలు పనిచేయకపోగా.. దీని నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి కావడం లేదు. వేల రూపాయలు ఖర్చుతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ట్రీ పర్యవేక్షణ లోపంతో కొద్ది నెలలుగా నిరుపయోగంగా మారిపోయింది. ఇనుప పైపులు తుప్పుపట్టాయి. దీనికి అవసరమైన మరమ్మతులు చేసి, పూర్వవైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో 'సత్యసాయి' ప్రతిభ

ఎంవీపీకాలనీ : సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 184 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే 184 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 123 మంది విద్యార్థులు 75 శాతం పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. సాయి మాధురి అనే విద్యార్థి 97.7 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, హోమేశ్‌రెడ్డి 97 శాతం, హేమంత్ హవిష్ 96 శాతంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచినట్లు తెలిపింది.

కేర్‌లో అంతర్జాతీయ నర్సెస్ డే వేడుకలు



కేర్ ఆస్పత్రిలో బహుమతులతో నర్సింగ్ సిబ్బంది

ఆరిలోవ : అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని కేర్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. హెల్త్‌సిటీ, రాంనగర్‌లో గల కేర్ ఆస్పత్రుల్లో నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి వారంరోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సీవోవో మయాఖ్ చౌదరి తెలిపారు. నర్సింగ్ సిబ్బంది సేవలను గుర్తించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించామన్నారు. నర్సులు ఆరోగ్య వ్యవస్థకు బలమైన వారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా అనాథ ఆశ్రమాలలో పిల్లలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి పిడియాట్రిక్ చెకప్‌లు, పోషకాహార విషయంలో సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



కొమ్మలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: 28వ వార్డు పరిధి నెహ్రూ నగర్, రామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. రెండు మూడు రోజుల క్రితం భారీ గాలులతో వర్షం పడటంతో చెట్టు కొమ్మలు కిందికి వాలిపోయాయి. ఏ క్షణంలోనైన తీగలపై పడే అవకాశం ఉండటంతో, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ సిబ్బంది వాటిని తొలగించారు.

శివాజీపాలెం రోడ్డులో కూలిన చెట్టు



రోడ్డు మధ్యలో కూలిన చెట్టు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట జాతీయ రహదారి నుంచి శివాజీ పార్క్ వచ్చే రోడ్డులో మంగళవారం తెల్లవారు జామున ఓ చెట్టు కూలిపోయింది. శివాజీపార్క్‌కు వచ్చే రోడ్డులో ఉన్న కైలాస ద్వారం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రద్దీగా ఉండే ఈ రోడ్డు మధ్యలో చెట్టు కూలినప్పటికీ ఆసమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కానీ ఉదయం ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ అధికారులు అక్కడకు చేరుకొని చెట్టును తొలగించారు.



సందర్శకులు లేక వెలవెలబోతున్న కంబాలకొండ పార్కు

భానుడి జ్వాల.. పర్యాటకం డీలా





- భగభగమంటున్న ఎండలు
- ఇంటికే పరిమితమవుతున్న ప్రజలు
- వెలవెలబోతున్న పర్యాటక ప్రాంతాలు



కంబాలకొండలో ఖాళీగా ఉన్న బోటింగ్ కొలను



కంబాలకొండలో ఖాళీగా ఉన్న అడ్వెంచర్స్ జోన్

ఆరిలోవ: వేసవి సెలవుల్లో కళకళలాడుతూ ఉండాల్సిన పర్యాటక ప్రాంతాలు వెలవెలపోతున్నాయి. భానుడి భగభగలతో సందర్శకులు ఇళ్లకే పరిమితం కావడంతో ఎక్కడా సందడి కానరావడం లేదు. సాధారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వగానే నగరంలో పర్యాటక కేంద్రాలు కళకళలాడుతుంటాయి. ఈ వేసవి సెలవుల్లో మాత్రం మండిపోతున్న ఎండలకు జనం బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో నియోజకవర్గ పరిధిలోని పర్యాటక ప్రాంతాలైన కంబాలకొండ, ముడసర్లోవ పార్కు, శివాజీపార్కు, జూ పార్కు, కైలాసగిరి సందర్శకులు లేక కళతప్పాయి. ఆదివారాల్లో మాత్రం జూపార్కు, కైలాసగిరిలో కొంతవరకు సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

పడిపోయిన సందర్శకుల సంఖ్య

జూ పార్కు, కైలాసగిరికి సాధారణ రోజుల్లో వేల సంఖ్యలో వెళ్లే సందర్శకుల సంఖ్య ఇప్పుడు వందల్లోకి పడిపోయింది. కంబాలకొండకు రోజులో సందర్శకుల సంఖ్య 10 దాటడమే కష్టమవుతోందని నిర్వాహకులు అంటున్నారు. ముడసర్లోవ పార్కు, శివాజీపాలెం పార్కుల్లో రోజుకు 50 మంది సందర్శకులు దాటడమే గగనంగా మారింది. జూ పార్కుకు సైతం ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో 800 సంఖ్య దాటడం లేదు. దీంతో వీటివద్ద వ్యాపారాలు జరగక చిరు వ్యాపారులు నిరాశపడుతున్నారు. ఎండల తీవ్రత పర్యాటక కేంద్రాలకు రావాల్సిన ఆదాయానికి గండికొడుతోందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాయంకాలం.. సాగరతీరం

- ఉష్ణతాపం నుంచి ఉపశమనం
- కళకళలాడుతున్న బీచ్‌లు



సీతకొండ బీచ్ వద్ద సాయంత్రం సమయంలో సందర్శకులు

పగలంతా ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు సాయంకాలం వేళ సాగరతీరంలో ఉపశమనం పొందుతున్నారు. దీంతో బీచ్‌లన్నీ రద్దీగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, సీతకొండ బీచ్‌లలో సాయంత్రం 6 గంటలు దాటితే సందడి నెలకొంటోంది. వందల సంఖ్యలో సందర్శకులు చేరడంతో ప్రతి బీచ్ కళకళలాడుతోంది. సముద్రంలో దిగి ఆటలాడుకునే పిల్లలు, ఇసుక దిబ్బలపై కూర్చొని చల్లదనంలో గడిపే పెద్దలు, బీచ్ రోడ్డు పక్కన గోడలపై కూర్చొని కడలి అలలు తిలకిస్తూ సేదదీరేవారితో రాత్రి 9 గంటలు దాటేవరకు ఈ ప్రాంతాలన్నీ సందడిగా ఉంటున్నాయి. ఆయాప్రాంతాల్లో చిరు వ్యాపారులకు కలిసివస్తోంది. మొక్కజొన్న పొత్తులు, పల్లీలు, మురీ మిక్చర్, ఐస్ క్రీం బళ్ల వద్ద పిల్లల సందడి కనిపిస్తోంది. సీతకొండ సీ వ్యూ పాయింట్, తెన్నేటి పార్కు వద్ద కొందరు పిల్లల పుట్టినరోజు వేడుకలు కూడా జరుపుకొంటున్నారు. చల్లని వాతావరణంలో కేక్ కట్ చేసి సందడి చేస్తున్నారు. ఇక్కడ రోడ్లు వాహనాల పార్కింగ్‌తో నిండిపోతున్నాయి.

కళాత్మకంగా... చిరుబండి



వాహన రూపంలో బడ్డీ

ఏయూక్యాంపస్ : ఈ చిరువ్యాపారి కాస్త కొత్తగా ఆలోచించాడు. చిరు దుకాణాన్ని చిన్నవ్యాన్ తరహాలో తీర్చిదిద్దాడు. బీచ్‌రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై దీన్ని ఏర్పాటు చేశాడు. వ్యాపారం చిన్నదయినా దానిపై ఆసక్తి ఉంటే చాలు, మనసుకు నచ్చే విధంగా దానిని మలచడం, అందరినీ ఆకట్టుకోవడం సాధ్యపడుతుంది.

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి



హరితకు డాక్టరేట్ అందజేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: పరిశోధనలకు ప్రతీ ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థిని లంకె హరితకి ఏయూ డాక్టరేట్ లభించింది. ఆమెకు మంగళవారం వీసీ రాజశేఖర్ పీహెచ్‌డీ పట్టా అందజేశారు. 'పర్ఫార్మన్స్ ఎవాల్యూయేషన్ ఆఫ్ "ఆహార భద్రత కోవిడ్-19 ప్రభావంపై సామాజిక ఆర్థిక, చట్టపరమైన దృక్పథాలు (ఒక అనుభవిక అధ్యయనం పాకిస్థాన్, శ్రీలంకకు ప్రత్యేక సూచన) అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆమెకు పీహెచ్‌డీ లభించింది.

బంగారు పతకాలకు నగదు అందజేత



చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి

విశాఖ విద్య: ఏయూ అప్లయిడ్ మ్యాథమేటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రాఘవేంద్ర రావు పేరున బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ ఆస్ట్రేలియాకు చెందిన ఏయూ పూర్వ విద్యార్థి రాఘవేంద్రరావు కుంబారి రూ.3 లక్షల చెక్కును వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు మంగళవారం అందజేశారు. అదేవిధంగా ప్యూర్ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి ఆచార్య నాగరాజారావు పేరున బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ మరో రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన దాతలను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, అట్టూరి నిర్మల పాల్గొన్నారు.

నగరాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేందిరప్రసాద్
- కేఆర్‌ఎం కాలనీలో ఆకస్మిక పర్యటన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. నగరాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. జీవీఎంసీ 23వ వార్డులోని కేఆర్‌ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. వ్యర్థాలను తొలగించి, వీధులను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. కేఆర్‌ఎం కాలనీలోని యార్డును పరిశీలించి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. కేఆర్‌ఎం కాలనీ తదితర ప్రాంతాలలో డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియను పరిశీలించారు. కాల్వలు, గెడ్డలను పరిశీలించిన ఆయన రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గెడ్డల్లో పూడికలు, వ్యర్థాలు తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్రసామును రాష్ట్ర, జాతీయ క్రీడల్లో చేర్చాలి

- అంతర్జాతీయ కర్రసాము క్రీడాకారుడు ఖరీదు సాంబయ్య
- చిన్నారుల ఆత్మరక్షణకు కర్రసామే ఆయుధమని వెల్లడి



అంతర్జాతీయ కర్రసాము క్రీడాకారుడు సాంబయ్య



నగరంలో ఓ శిక్షణ శిబిరంలో చిన్నారులకు కర్రసాములో మెలకువలు చెబుతున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: కర్రసామును రాష్ట్ర, జాతీయ క్రీడల్లో చేర్చాలని అంతర్జాతీయ కర్రసాము క్రీడాకారుడు డాక్టర్ ఖరీదు సాంబయ్య పేర్కొన్నారు. గత వారం రోజులుగా విశాఖకు చెందిన కర్రసాము శిక్షకుడు శ్యామలరావు ఆధ్వర్యంలో పీఎం పాలెం, ఎంవీపీ కాలనీ, మధురవాడ తదితర ప్రాంతాల్లో చిన్నారులకు అందిస్తున్న శిక్షణా శిబిరాలను సాంబయ్య పరిశీలించారు. రెండు రోజుల పాటు చిన్నారులకు కర్రసాములో మెలకువలను నేరిప్పించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సంప్రదాయ యుద్ధ కళల్లో కర్రసాము ఒకటన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారు జంతువులను నుంచి ప్రాణాలను రక్షించుకునేందుకు కర్రనే ఆయుధంగా వాడేవారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దొంగలను తరిమికొట్టడానికి, వ్యవసాయ క్షేత్రాల్లో పనులకు, సైనికుల రాజ్యరక్షణకు ఇలా అనేక అంశాల్లో సంప్రదాయంగా కర్ర వినియోగించారన్నారు. ఆధునిక యుగంలో కర్రసాముకు ఆదరణ కొరవడుతోందన్నారు. ఈ నేపథ్యంలో కర్రసాముకు పూర్వవైభవం తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో చిన్నారులు, ఆడపిల్లలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేసే సత్తా కర్రసాముకు ఉందన్నారు. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నతనం నుంచి కర్రసాము తర్ఫీదు ఇప్పించాలని సూచించారు. ఈ దిశగా నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులను ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో నగర కర్రసాము శిక్షకుడు శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

సరైన ఆహారంతో ఊబకాయ నియంత్రణ

ఏయూక్యాంపస్: సరైన ఆహారం తీసుకుంటూ ఊబకాయాన్ని నియంత్రించాలని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచించారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నోటికి రుచిని కలిగించే ఆహార పదార్థాల వెనుక ఆరోగ్యానికి పెనుముప్పు దాగి ఉంటుందన్నారు. నిత్యం బాదంను ఆహారంలో భాగం చేసుకోవడం వలన అవసరమైన ప్రొటీన్, విటమిన్లు లభిస్తాయన్నారు. పెసర, శనగ గింజల నుంచి మొలకలు వచ్చిన ఆహారం, కూరగాయల సలాడ్‌లు, వేయించిన శనగలు వంటివి శరీర బరువును క్రమబద్ధీకరిస్తాయన్నారు.

కన్సాలిడేటెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కన్సాలిడేటెడ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వర్సిటీ అధికారులను మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు సిర్ల శ్యామసుందరరావు కన్సాలిడేట్ ఉద్యోగుల సమస్యలను వీసీకి వివరించారు. వర్సిటీలోని వివిధ విభాగాల నుంచి సేవలు అందిస్తూ, వర్సిటీ ప్రగతిలో భాగస్వాములుగా నిలుస్తున్నామన్నారు. ఉన్నత విద్యార్హత కలిగి 10 ఏళ్లకు పైబడి ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్న వారు కూడా ఉన్నారని తెలిపారు. గతంలో వర్సిటీలో కన్సాలిడేటెడ్ ఉద్యోగులను సర్వీస్ ఆధారంగా టైం స్కేల్ ఉద్యోగాలకు ప్రమోట్ చేసే సంప్రదాయం ఏయూలో ఉందని, దానిని కొనసాగించాలని కోరారు. సర్వీస్ ఆధారంగా ఉద్యోగ పురోగతితో పాటు జీతాల పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత 8 ఏళ్లలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది మార్చిలో కన్సాలిడేటెడ్ ఉద్యోగుల జీతంలో 20 రోజులు కోత విధించిన విధానాన్ని నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో పడవల సంజీవరావు, పి.రవికుమార్, శ్రీను, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



బస్ కండీషన్ పరిశీలించిన మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి

మద్దిలపాలెం : ఆర్టీసీ బస్సుల నిర్వహణపై మద్దిలపాలెం డిపో అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. నిర్ణీత మైలేజీ దాటిన బస్సులను మెయింటెనెన్స్‌కు ఆపి, వాటికి సంబంధించిన సాంకేతిక లోపాలను డ్రైవర్లు, మెకానిక్‌ల ద్వారా గుర్తించి సరిచేస్తున్నారు. నిర్వహణ అనంతరం బస్సులను కనీసం 5 కిలోమీటర్ల రోడ్డు టెస్ట్‌కు తీసుకువెళ్లి కండీషన్‌ను చెక్ చేస్తున్నారు. బస్సును డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ నడపగా.. డిపో మేనేజర్ సంబంధిత మెకానిక్‌లు, సూపర్‌వైజర్ బస్సులో ప్రయాణం చేశారు. ఇందులో భాగంగా ఓ బస్సు రోడ్డు టెస్టులో డిపో మేనేజర్ అరుణకుమారి, ఏఈ హిమబిందు, మెకానిక్ సిబ్బందితో పాటు పాల్గొని కండీషన్‌ను పరిశీలించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో నవోదయ సత్తా

కొమ్మాది: సీబీఎస్‌ఈ మంగళవారం వెల్లడించిన పది, ప్లస్ 2 ఫలితాల్ల స్థానిక నవోదయ విద్యాలయ విద్యార్థులు శతశాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ డా.వైఎస్‌ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. 12వ తరగతిలో 36 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా 560 మార్కులతో ఒమ్మి రుక్మిణి, ఒ.ఉమ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పదవ తరగతిలో 79 మంది విద్యార్థుల్లో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వీరిలో బాడిరెడ్డి సాయిచేరన్(589), విడదల ధనుశ్రీ(586), బి.ప్రవీణ్(582) తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

విశాఖ విద్య : సీబీఎస్‌ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎం.వి.సురేష్ తెలిపారు. శ్రేయస్ కుమార్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 498 మార్కులు సాధించి విశాఖపట్నం సిటీలో చరిత్ర తిరగరాశాడని పేర్కొన్నారు. 490కి పైగా మార్కులు 18 మంది, 487కి పైగా మార్కులు 31 మంది, 480కి పైగా మార్కులు 47 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ, శ్రీచైతన్య కాలేజీల ఉత్తరాంధ్ర ఏజీఎం రమణ తదితరులు అభినందించారు.

గొయ్యి పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్..



సూర్యతేజానగర్ వద్ద రోడ్డు మధ్యలో పూడ్చిన గొయ్యి

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి చినగదిలి కూడలి నుంచి సూర్యతేజానగర్ మీదుగా పార్వతీనగర్ గెడ్డ వరకు డబుల్ రోడ్డు మధ్యలో గొయ్యి ప్రమాదరంగా మారింది. ఇరుకుగా ఉన్న ఈ రోడ్డును జీవీఎంసీ రెండేళ్ల క్రితం విస్తరించి డబుల్ రోడ్డు నిర్మించింది. వాటర్ పైప్‌లైన్ పాడవడంతో నీటి సరఫరా విభాగం సిబ్బంది ఇక్కడ రోడ్డు మధ్య పెద్ద గొయ్యి తవ్వి మరమ్మతులు చేశారు. పని పూర్తయిన తర్వాత గొయ్యిని మట్టితో పూడ్చి మెటల్ వేయకుండా వదిలేశారు. ఆ మట్టి కిందకు దిగిపోయి రోడ్డు మధ్యలో గొయ్యిలా మారడంతో వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. దీనిపై ఈనెల 8న సాక్షిలో ప్రచురితమైన 'రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి' శీర్షికతో వెలువడిన వార్త జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఆ గొయ్యిని మెటల్ వేసి కాంక్రీట్‌తో పూడ్చారు. దీంతో స్థానికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా చిన పోలమాంబ పండగ

- ఘనంగా ముగిసిన ఉత్సవాలు
- ఆఖరి రోజు శాంతమూర్తిగా అమ్మవారి దర్శనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం: శివాజీ పాలెం, పీతలపాలెం గ్రామదేవత చిన పోలమాంబ వార్షిక జాతర మహోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ఆఖరి రోజు అమ్మవారు శాంతమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రీకృష్ణ సేవాసంఘం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు కనులపండువగా సాగింది. ఊరేగింపులో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. అమ్మవారిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, అక్కరమాని వెంకట్రావు, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి దంపతులు, బట్ట రమణ తదితరులు దర్శించుకున్నారు. శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దువ్వి నాగరాజు, బుద్ధల కృష్ణ, గౌరవ అధ్యక్షుడు కె.రమేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: మంగళవారం పాతనగరం రైతు మార్కెట్ ప్రాంతంలో విజయ దుర్గ మోటార్ యూనియన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పాల్గొని సైబర్ క్రైమ్ కేసులు, నేరాల నిరోధంపై అవగాహన కల్పించారు. పోలీసు అధికారులకు సహకరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు సేవించకూడదని పేర్కొన్నారు. ప్రజలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతి భద్రతలు కాపాడే విధంగా సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా నేర కార్యకలాపాలు జరుగుతున్నట్టు అనుమానం వచ్చినా, లేదా జరగవచ్చని ముందస్తు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు. అనంతరం నాకాబందీ నిర్వహించి పలు వాహనాలు తనిఖీ చేశారు.